RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 15 పేజీలు - 05 వెల - 04/- గురువారం 10 అక్టోబర్ 2024

# దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడం అందరి బాధ్యత

## త్వరలోనే నదులను అనుసంధానం చేస్తాం: చంద్రబాబు

**విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు**

**దుర్గ గుడిలో ఈసారి సేవా కమిటీని వేశామని వెల్లడి**

విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: ఏపీ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఆయన కుటుంబ సమేతంగా విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మవారి జన్మనక్షత్రమైన ఈరోజున ఆమెను దర్శించుకోవడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తిరుమల తర్వాత రెండో అతి పెద్ద దేవాలయం విజయవాడ దుర్గగుడి అని అన్నారు. దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చంద్రబాబు చెప్పారు. దుర్గ గుడిలో ఈసారి ఉత్సవ కమిటీని కాకుండా... సేవా కమిటీని వేశామని తెలిపారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు 67,931 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు. త్వరలోనే నదుల అనుసంధానం ఉంటుందని తెలిపారు. ఈ పనులన్నీ త్వరలోనే పూర్తికావాలని అమ్మవారిని కోరుకున్నానని చెప్పారు.

మరోవైపు, దుర్గమ్మ ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చిన్నరాజగోపురం వద్ద ముఖ్యమంత్రి తలకు అర్చకులు పరివేష్టం చుట్టారు. ఆ తర్వాత మేళతాళాల మధ్య అమ్మవారికి చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.

# కాలుష్య నివారణలో భాగస్వాములు కండి

- **నిపుణులకు పవన్ కల్యాణ్ పిలుపు**
- **పర్యవరణ పరి రక్షణకు సూచనలివ్వండి**
- **నిపుణులకు పవన్ కల్యాణ్ పిలుపు**




విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: కాలుష్య నివారణకు ప్రణాళికలు అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఏ పనైనా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ ముఖ్యమన్నారు. పర్యావరణం బాగుండాలని కోరుకునే వాళ్లలో తానూ ఒకరినని తెలిపారు. పర్యావరణ హితం అనేది పరిశ్రమల బాధ్యత కావాలి. అభివృద్ధిలో భాగమయ్యే పరిశ్రమలు భావి తరాలకు చక్కటి పర్యావరణం అందించడం కూడా తమ బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కావాలి.. అభివృద్ధి అవసరం అయిన నేటి తరుణంలో పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే సమయంలో సాధ్యమైనంతగా కాలుష్య రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు.విజయవాడలోని ఓ హెూటల్ లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎన్జీవోలు, నిపుణులు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన వర్క్ షాపును పవన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "భావి తరాలకు భవిష్యత్తు లేకుండా చేసే అభివృద్ధి సరికాదు. కాలుష్య నియంత్రణ మండలి అనగానే పరిశ్రమలకు వ్యతిరేకం అనే భావన సరికాదు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవడం, అభివృద్ధిపథంలో ముందుకు సాగడం అనేవి రెండూ కీలకమైనవే. దీనికి తగిన మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. నిపుణులు దీనిపై దృష్టి పెట్టాలి. విశాఖపట్నంలో కాలుష్యం విషయంలో కాని, ఇతర ప్రాంతాల్లో తీవ్రమవుతున్న కాలుష్యం విషయంలో శాశ్వతమైన పరిష్కారం, అందరూ ఆమోదించేలా విధానం తీసుకురావల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు. **మిగతాది 2లో...**

# కొత్త కార్డులొస్తున్నాయ్

**4 వేల కొత్త రేషన్ దుకాణాల ఏర్పాట్లు, డీలర్ల పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం**

**రేషన్‌కార్డులు పొందేందుకు ఆదాయ పరిమితి సడలింపు!**




విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: రేషన్ కార్డు లేని అర్హులైన పేదలకు త్వరలోనే వాటిని మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్‌కార్డుల్లో పేరు మార్పు చేర్పులకు కూడా అవకాశం ఇవ్వనుంది. కుటుంబ సభ్యుల పేర్లు తొలగింపు, చేర్పు, కుటుంబాల విభజన, అడ్రస్ మార్పు, కార్డులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం వంటి వాటిపైనా నిర్ణయం తీసుకోనున్నారు.రేషన్‌కార్డులు పొందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలవారీ ఆదాయం రూ. 12 వేలు మించకుండా ఉండాలని గత ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రేషన్‌కార్డు కోల్పోయారు. ప్రభుత్వ పథకాలకు తామంతా దూరమయ్యామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయ పరిమితిని పెంచి తమకు కూడా రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే మంత్రివర్గ సమావేశంలో దానిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీపైనా నిర్ణయం తీసుకోనుంది. ఖాళీగా ఉన్న ఆరువేల రేషన్ డీలర్ల పోస్టులను భర్తీ చేయడంతోపాటు కొత్తగా 4 వేలకు పైగా దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

# మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

**ఈ నెల 11 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ**



విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన ఏపీలోని కూటమి ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మద్యం షాపులు దక్కించుకోవాలనుకునే ఆశావహులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. దరఖాస్తు గడువును పొడిగించింది. ఈ మేరకు ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ల షెడ్యూల్ గడువు పెంచాలని కోరుతూ వివిధ జిల్లాల్లో ఉన్న దరఖాస్తుదారుల నుంచి పెద్ద ఎత్తున్న అభ్యర్థనలు రావడంతో ఎక్సైజ్ అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్కార్ షెడ్యూల్‌ను మార్చింది. 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించి, 14న మద్యం షాపులకు లాటరీ విధానంలో డ్రా తీసి, 16 నుంచి దుకాణాలను కేటాయిస్తామని తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,396 మద్యం దుకాణాలకు గాను మంగళవారం రాత్రి వరకు 41,348 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 826.96 కోట్ల ఆదాయం వచ్చినట్టు సమాచారం. ఒక్కో దరఖాస్తుకు నాన్-రిఫండబుల్ కింద రూ. 2 లక్షలు చెల్లించాలన్న విషయం తెలిసిందే

# రెపో రేటు యథాతథం



**వరుసగా 10వ సారి 6.5 శాతంగా కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ భేటీలో నిర్ణయం**

కీలకమైన రెపో రేటును వరుసగా 10వ సారి 6.5 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ నిర్ణయించింది. బుధవారంతో ముగిసిన మూడు రోజుల 'ద్రవ్య విధాన కమిటీ భేటీ'లో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. రెపో రేటును యథాతథంగా కొనసాగించాలంటూ ఆరుగురిలో ఐదుగురు సభ్యులు అనుకూలంగా ఓటు వేశారని ఆయన చెప్పారు.ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇక ఎస్‌డీఎఫ్ (సస్టెయినబుల్ డిపాజిట్ ఫెసిలిటీ) రేటు 6.25 శాతం, ఎంఎస్‌ఎఫ్ (మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ) రేటు, సేవింగ్స్ రేటు 6.75 శాతంగా ఉన్నాయని ఆయన వివరించారు.

**మిగతాది 4లో...**

# ఓడిపోతే ఇవిఎంలదే తప్పా ?



2లో

# టీడీపీలో చేరిన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు

**ఉండవల్లిలోని సీఎం నివాసంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీలు**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు**

**హాజరైన పలువురు మంత్రులు, టీడీపీ నేతలు**



విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: మాజీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉండవల్లిలోని ఏపీ సీఎం చంద్రబాబు నివాసంలో ఆయన సమక్షంలోనే టీడీపీ కండువాను కప్పుకున్నారు. వారికి చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, టీడీపీ నేతలు ఉన్నారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్న బీద మస్తాన్ రావు 2019లో వైసీపీలో చేరారు. నాటి వైసీపీ ప్రభుత్వం 2022లో ఆయనను రాజ్యసభకు పంపించింది. మోపిదేవి వెంకటరమణ తొలుత కాంగ్రెస్‌లో ఉన్నారు. 2012లో వైసీపీలో చేరారు. ఇప్పుడు ఇరువురు టీడీపీ జెండా కప్పుకున్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్



విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9: మూలా నక్షత్రం కావడంతో సరస్వతీదేవీ అలంకారంలో అమ్మవారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమార్తె ఆద్యతో కలిసి బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద పవన్‌కు స్వాగతం పలికిన అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు. ఉప ముఖ్యమంత్రితో పాటు హెూంమంత్రి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్ కూడా దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇవాళ మూలా నక్షత్రం కావడంతో సరస్వతీదేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

# కాలుష్య నివారణలో భాగస్వాములు కండి

(మొదటి పేజి తరువాయి)



పరిశ్రమల్లో కాలుష్యంతోపాటు ప్రమాదాలు ఈ మధ్య కాలంలో ఎక్కువవుతున్నాయి. వీటి నివారణకు ఓ మార్గం చూపాలి. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతౌల్యం దెబ్బ తినకుండా పరిశ్రమల ఏర్పాటు కావాలి. భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయు కాలుష్యాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వేగవంతమైన అభివృద్ధి కోసం ప్రభుత్వం తపిస్తున్న సమయంలో కాలుష్య రహిత పరిశ్రమలు, వాటి విధివిధానాల రూపకల్పనకు నిపుణులు, మేధావులు విలువైన సూచనలు అందించాలి. వారి సూచనలు సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి. పర్యావరణం మేలు గురించి ఎన్జీవోలు చేస్తున్న కృషి అభినందనీయం. వారి సేవలను కాలుష్య నియంత్రణ మండలి ఉపయోగించుకుంటుంది. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుంది. ఈ ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణకు అందరూ సమష్టిగా పని చేయాలి" అన్నారు.

ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలబడాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు అందరి సలహాలు, సూచనలు అవసరమని పేర్కొన్నారు. కాలుష్య నివారణకు ప్రణాళికలు అవసరమని పవన్ తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు సరైన నిర్ణయంతోనే మంచి ఫలితాలు సాధ్యమని పవన్ పేర్కొన్నారు?????.

"నిపుణులు, అనుభవజ్ఞుల సలహాలు రాష్ట్రాభివృద్ధికి అవసరం. మేం చెప్పడానికి కాదు.. వినేందుకే సిద్ధంగా ఉన్నాం. ఒక్కోసారి భవిష్యత్తు ఎలా ఉంటుందా అని భయమేస్తోంది. కాలుష్యం పెరుగుతోంది" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## మద్యం షాపుల్లో సిండికేట్లను ఉపేక్షించం : కొల్లు రవీంద్ర




విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
ఏపీలో మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆన్ లైన్, ఆఫ్ లైన్లో షాపులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. దరఖాస్తు రుసుమును రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. ఈ నెల 16 నాటికి కొత్త వైన్ షాపులు తెరుచుకోనున్నాయి. మరోవైపు, షాపులను సొంతం చేసుకోవడానికి సిండికేట్లుగా ఏర్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతరులు టెండర్లు వేయకుండా ఎమ్మెల్యేలు ఒత్తిడి చేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలకు తావివ్వొద్దని మంత్రి ఆదేశించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా షాపులను కేటాయించాలని చెప్పారు. దరఖాస్తు ప్రక్రియ, షాపుల కేటాయింపులు పారదర్శకంగా ఉండాలని అన్నారు. సిండికేట్లకు సహకరించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే వారికి అధికారులు సహకరించాలని చెప్పారు.

## హనుమంత వాహనంపై శ్రీవారి అభయం


### వైభవంగా తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

### సాయంత్రం శ్రీవారి స్వర్ణ రథోత్సవం రాత్రి స్వామివారికి గజ వాహన సేవ



తిరుమల ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారు రాముడి అలంకరణలో హనుమంత వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. గురు శిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచన తెలిసిన మహనీయులు కాబట్టి ఈ ఇరువురిని దర్శించుకున్న వారికి వేదాలతత్త్వం ఒనగూరుతుందని నమ్మకం. విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు వాహన సేవను తిలకించారు. ఈ రోజు సాయంత్రం స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రికి స్వామివారికి గజ వాహన సేవ నిర్వహిస్తారు

# ఓడిపోతే ఇవిఎంలది తప్పా ?




ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించగా కాశ్మీర్‌లో ఇండియా కూటమి గెలిచింది. ఎన్‌సితో పొత్తు ద్వారా కాశ్మీర్‌లో కాంగ్రెస్ కొన్ని సీట్లు సాధించుకో గలిగింది. ఇక హర్యానాలో గెలుస్తారని సర్వేలు చెప్పినా..అనూహ్యంగా బిజెపి పుంజుకుని విజయం సాధించింది.ఇంతవరకు బాగానే ఉన్నా..మరోమారు కాంగ్రెస్ తన అనుమానాలను బయటపెట్టింది. ఇవిఎంల ట్యాంపరింగ్ అంటూ పాత పాట పాడింది. కాశ్మీర్‌లో కూడా ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి గెలిచేది. హర్యానాలో ట్యాంపర్ చేసిన బిజెపి,కాశ్మీర్‌ను మాత్రం వదులుకుంటుందా అన్నదే ప్రశ్న. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తే రెండు రాష్ట్రాలపై చేయాలి. వారు గెలిచిన కర్నాటక, తెలంగానల పైనా చేయాలి. కానీ గెలిచిన చోట వదిలి ఓడిన చోట ట్యాంపరింగ్ అంటే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. పదేళ్ల యూపిఎ పాలన అంతా ట్యాంపరింగ్ గెలుపుతో నడిచిందా అన్నది కూడా కాంగ్రెస్ చెప్పాలి. ట్యాంపరింగ్ అనుమానాలపై ఇప్పటికే నివృత్తి జరిగింది. ఇసి పలు సందర్భాల్లో వాటిని ఎలా వినియోగిస్తున్నదీ వివరించింది. టెక్నికల్ టీమ్ వాటిని సరిచూసింది. ఈ క్రమంలో ఇవిఎంలపై అనుమానాలను మాత్రం బిజెపి కొట్టి పారేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో దీనిపై అనుమానాలు అక్కర్లేదు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తూ..తమను ప్రజలు తిరస్కరించారన్న నిజాన్ని కాంగ్రెస్ అంగీకరించడం లేదని అందరూ గుర్తుంచుకోవాలి. గతంలో అనేకమార్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఆనాడు అనుమానాలు వ్యక్తం చేయలేదు. తాజాగా ఇప్పుడు మారోమారు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇవిఎంలతోనే గతంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తున్నప్పుడల్లా ఓటమి చెందుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియాకూటమితో పోవడంతోనే ఈ మాత్రం సీట్లు సాధించగలిగింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారడంతో నెపాన్ని ఇవిఎంలపైకి నెట్టేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ ఇండియా పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. గత పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి తలపడ్డ అనేక సందర్భాల్లో ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది. హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ,
కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94 శాతం ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09శాతం ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది. 2022లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. ఈ విజయాలను విశ్లేషించుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలి. ఇవిఎంలపై నెపాన్ని నెట్టేసి, అది మోడీ కుట్ర అంటూ సాగితే ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. హర్యానాలో ఓటమి గుణపాఠం కావాలి. మరింత పట్టుదలగా పనిచేయాలి. అధికారం ఉన్న రాష్ట్రాల్లో ఆదర్శ పాలన అందించాలి. ఢిల్లీ ప్రదక్షిణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. చీటికిమాటికీ మంత్రులు, ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకునే సంస్కృతి పోవాలి. కాంగ్రెస్ తన లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగితేనే ప్రజలు ఆదరిస్తారు.

## భారీ వరదల తక్షణ సాయంగా ఎన్‌టీఆర్ జిల్లాలో చేసిన ఖర్చుల వివరాలను వెల్లడించిన ఏపీ ప్రభుత్వం

విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రభుత్వం చేసిన ఖర్చుల వివరాలను విడుదల చేసిన రెవెన్యూ శాఖ
మొత్తం ఖర్చులు రూ. 139.75 కోట్లు
ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ. 89కోట్లు
చేసిన చెల్లింపులు రూ. 79 కోట్లు
ఇటీవలి భారీ వర్షాలు, వరదల తక్షణ సాయంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రభుత్వం చేసిన ఖర్చుల వివరాలను తాజాగా ఏపీ రాష్ట్ర రెవెన్యూ శాఖ విడుదల చేసింది. మొత్తం ఖర్చులు రూ. 139.75 కోట్లుగా ప్రభుత్వం పేర్కొంది. ఇందులో ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ. 89 కోట్లు కాగా, చేసిన చెల్లింపులు రూ. 79 కోట్లు. ఇంకా అందుబాటులో ఉన్న నిధులు రూ. 10 కోట్లుగా రెవెన్యూ శాఖ వెల్లడించింది.

### ఖర్చుల వివరాలివే..

కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు - రూ.23 లక్షలు
తాగునీటి బాటిళ్లు - రూ. 11.22 కోట్లు
ఆహార ప్యాకెట్లు - రూ. 57.22 కోట్లు
గుడ్లు, పాల ప్యాకెట్లు - రూ. 11.08 కోట్లు
బాధితులకు డ్రై ఫుడ్ - రూ. 3.74 కోట్లు
సహాయ శిబిరాల నిర్వహణ - రూ. 4.80 కోట్లు
మృతులకు పరిహారం - రూ. 1.95 కోట్లు
పండ్లు - రూ. 3.64 కోట్లు
సబ్సిడీ కూరగాయలు - రూ. 8.88 కోట్లు
రవాణా ఖర్చులు - రూ. 5.35 కోట్లు
మున్సిపాలిటీలకు - రూ. 20.56 కోట్లు
వైద్యం ఆరోగ్యం కోసం - రూ. 4.55 కోట్లు
వసతుల ఏర్పాట్లకు - రూ. 2.07 కోట్లు
మత్స్యకారులకు, పడవలకు - రూ. 89 లక్షలు
పోలీసు శాఖ రవాణా ఖర్చులు - రూ. 2.60 కోట్లు
వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హమాలీలకు - రూ. 32 లక్షలు
ఇతర జిల్లాల నుంచి తరలించిన సిబ్బందికి - రూ. 34 లక్షలు.

# విశాఖ సాగరతీరానికి టీసీఎస్ హారం

## టాటా గ్రూప్‌ని ఒప్పించి రప్పించిన మంత్రి లోకేశ్

### ముంబైలో టాటా సన్స్ ఛైర్మన్ ఎం. చంద్రశేఖరన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ

### ఈవీ, ఎయిరో స్పేస్, స్టీల్, టూరిజం రంగాల్లో పెట్టుబడుల అవకాశాలూ పరిశీలిస్తామన్న టాటా గ్రూప్






విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
లులూ, ఒబెరాయ్, బ్రూక్ ఫీల్డ్, సుజలాన్ తర్వాత ఏపీకి భారీ గిఫ్ట్‌గా టీసీఎస్‌ను తెచ్చిన లోకేశ్ ఐటీ హబ్‌గా విశాఖ, ప్రఖ్యాత కంపెనీల పెట్టుబడులకు గమ్యస్థానంగా మారనున్న ఏపీ అందాల విశాఖ సాగరతీరంలో టాటా కన్సల్టెన్సీ సర్వీస్ మణిహారంగా మెరవనుంది. మెరుగైన జీతభత్యాలు అందిస్తూ... 10 వేల ఐటీ ఉద్యోగాలు యువతకు లభించనున్నాయి. యువగళం పాదయాత్రలో యువనేత, మంత్రి నారా లోకేశ్ ఏపీకి ప్రఖ్యాత ఐటీ కంపెనీలను రప్పించి లక్షలాది మందికి స్థానికంగా ఉపాధి కల్పిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట నెరవేర్చే దిశగా ప్రయత్నాలు చేసి టాటా గ్రూప్ ఛైర్మన్, పెద్దలను ఒప్పించి విశాఖకు టీసీఎస్‌ని రప్పించారు. ముంబై మహానగరంలోని టాటా సన్స్ ఆఫీస్ బాంబే హౌస్‌లో టాటా సన్స్ ఛైర్మన్ ఎం. చంద్రశేఖరన్‌తో నిన్న ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంవో అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా, టాటా గ్రూప్ అధికారులు పాల్గొన్నారు.ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, విశాఖలో ఐటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను మంత్రి లోకేశ్ వారికి వివరించారు. తమ టీసీఎస్ సెంటర్‌ను విశాఖలో నెలకొల్పుతామని, 10 వేల ఉద్యోగాలు కల్పిస్తామని టాటా గ్రూప్ ప్రకటించింది. ఏపీలో ఈవీ, ఎయిరో స్పేస్, స్టీల్, హోటల్స్, టూరిజం రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలు పరిశీలిస్తామని మంత్రి నారా లోకేశ్‌కు టాటా గ్రూప్ తెలిపింది.టీసీఎస్ ఏర్పాటుపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ విశాఖలో ఏర్పాటు చేసి 10,000 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ఏపీ ప్రఖ్యాత కంపెనీలను స్వాగతిస్తోందని తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామికాభివృద్ధిలో ఏపీని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ పెట్టుబడి తొలి అడుగు కానుందని హర్షం వ్యక్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో దూసుకెళ్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. సీఎం ఆదేశాలతో, తాను యువతకి-రాష్ట్ర ప్రజలకి ఇచ్చిన మాట మేరకు మంత్రి నారా లోకేశ్ ప్రఖ్యాత కంపెనీలను రప్పించేందుకు ప్రయత్నాలు చేసి విజయవంతమయ్యారు. లులూ, ఒబెరాయ్, బ్రూక్ ఫీల్డ్, సుజలాన్ ఇప్పటికే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇప్పుడు లోకేశ్ ఐటీ అభివృద్ధిలో గేమ్ ఛేంజర్ కానున్న టాటా గ్రూప్‌ని ఒప్పించి... మెప్పించి టీసీఎస్ రప్పించారు. టీసీఎస్ రాకతో ఐటీ హబ్‌గా విశాఖ... ప్రఖ్యాత కంపెనీల పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారనుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 10 అక్టోబర్ 2024

# ఇ పంట నమోదుపై సూపర్ చెక్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.





ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 09: రైతులు వేసిన ప్రతి పంటను ఈ క్రాఫ్ బుకింగ్ చేస్తూ వివరాలను పొందుపరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల మండలం కానాల గ్రామం, మహానంది మండలం అల్లినగరం గ్రామాలలో రైతులు వేసిన వరి, మిరప పంటల ఈ క్రాఫ్ట్ బుకింగ్ నమోదులపై సూపర్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు వేసిన ప్రతి పంటను ఈ క్రాఫ్ బుకింగ్ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వాస్తవ సాగుదారులు వేసిన ప్రతి పంటను ఇ పంటలో నమోదు చేయడంతో పాటు ఇ పంట లో పొందుపరిచిన రైతులందరికీ ఈకేవైసి చేయించే ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల ఈకేవైసీ ప్రక్రియ బుధవారం చివరి రోజు అయినందున 100 శాతం పూర్తి కావాలని రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు కూడా వారు వేసిన పంటను ఇ పంటలో నమోదు చేసుకోవడంతోపాటు ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు వ్యవసాయ అధికారుల వెంట పడాలని రైతులను సూచించారు. ఇ పంట లో నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా పంట నష్ట పరిహారం, పంటల బీమా, మద్దతు ధరతో పంటల కొనుగోలు తదితర ప్రయోజనాలు అందుతాయని కలెక్టర్ రైతులకు వివరించారు. తొలుత నంద్యాల మండలం కానాల గ్రామంలో రైతులు వేసిన మిరప, వరి పంటలను సందర్శించి ఇ పంటలో పొందుపరిచిన రైతు వివరాలు, సర్వే నంబరు, పంట, నీటి వసతి సరిగా నమోదు చేశారో లేదో అని పరిశీలిస్తూ సూపర్ చెక్ నిర్వహించారు. అనంతరం మహానంది మండలం అల్లినగరం గ్రామాలలో రైతులు వేసిన అరటి పంటల ఈ క్రాఫ్ట్ బుకింగ్ నమోదులను నిశితంగా పరిశీలిస్తూ ధృవీకరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డి.రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు, కానాల, అల్లినగరం గ్రామాల వ్యవసాయ అధికారులు వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఎన్ఎండి ఫయాజ్



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 08: నంద్యాల పట్టణంలోని 8వ వార్డు ఉప్పరపేట నందు టిడిపి 8 వ వార్డు ఇంచార్జ్ ఉప్పరి సురేష్ కుమార్ , ఉప్పరి సుబ్రహ్మణ్యం (సుబ్రి) ఆహ్వానం మేరకు ఉప్పరి పేట నందు ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఎన్ఎండి ఫయాజ్ లు దర్శించుకున్నారు. విజయ దశమి సందర్భంగా టిడిపి నాయకులు , కార్యకర్తలు , అభిమానులతో కలిసి వెళ్లి మంత్రి ఫరూక్ ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మరియు 8 వ వార్డు టిడిపి నాయకులు , ప్రజలు మంత్రి ఫరూక్ కి , ఫయాజ్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలు అందరినీ దుర్గమ్మ చల్లగా చూడాలని పూజలు చేశామన్నారు. భక్తులు నవరాత్రులు ఎంతో నిష్ఠతో పూజలు చేస్తారన్నారు . అందరినీ దుర్గమ్మ కరుణించాలని అన్నారు. నాడు తెలుగు దేశం ప్రభుత్వం హాయంలో నంద్యాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే మళ్లీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆ అమ్మవారి దయతో అభివృద్ధి పనులను కొనసాగించేలా చేయాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా రోజు చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుందని మంత్రి ఫరూక్ తెలియజేశారు . అలాగే నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ మరియు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు మంత్రి ఫరూక్ ని , ఫయాజ్ ని ఘనంగా సన్మానించుకున్నారు . ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారావు , గిరీష్ , సునీల్ , అనుపూరి ఈశ్వరయ్య , ప్రభాకర్ రెడ్డి , పోతులూరు మహేంద్ర , చలం బాబు , ఆంజనేయులు గౌడ్ , దుర్గ గౌడ్ , సుభాని , ఉదయ్ మరియు 1 టౌన్ సిఐ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులపై రైతన్నలకు అవగాహన

### -సేంద్రియ ఎరువులు- రైతుకు నేస్తాలు. -చింతలచెరువు లో రైతు సదస్సులు.



ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ్డ అక్టోబర్ 08: సేంద్రియ ఎరువులు రైతన్నలకు నేస్తాలని తద్వారా అధిక పంటల దిగుబడి పెంచడానికి రైతన్నలు సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ ఎల్ పి మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బిల్లా రాజేష్ యాదవ్, ఏరియా సేల్స్ మేనేజర్ పట్నం మోహన్ ,సేల్స్ ఆఫీసర్ మస్తాన్ ,ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ నాయకులు అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని చాగలమర్రి మండలం చింతల చెరువు గ్రామంలో వినూత్న ఆగ్రోటిక్ఎల్.ఎల్.పిఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగు విషయంలో రైతులు అనేక సమస్యలను కంపెనీ ప్రతినిధులతో సంప్రదించారు. పంటల తెగుళ్లు తట్టుకుని అధిక దిగుబడి సాధించింది వినూత్న అగ్రి టెక్ ఎల్.ఎల్.పి వారి ఉత్పత్తులైన సేంద్రియ ఎరువులనురైతు సోదరులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు.రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ , టర్బో కే జి ఎఫ్6, రోషిని, ఉజ్వల్ , త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృథ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33/ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్–22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సం?రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రియ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకల నివారణ పై రైతులకు అవగాహన.



ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 09: మహానంది మండలం నందిపల్లె గ్రామంలో వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో దుబ్బు దశ నుండి గింజలు ఏర్పడే దశ వరకు ఎలుకలు ఎక్కువగా ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయని, ఫలితంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు.ఖరీఫ్ లో ఎలుకల ఉధృతి ఎక్కువ ఉంటుందని, రైతులు పొలాలు ఖాళీగా ఉన్నప్పటినుండే ఎలుకలు నివారణ పై దృష్టి పెట్టాలని, రైతులంతా కలిసి సామూహిక యాజమాన్య పద్ధతులు పాటించుట ద్వారా ఎలుకలను సమూలంగా నివారించుకోవచ్చునని తెలియజేశారు. రైతులకు బ్రొమోడైయోలిన్ అనే ఎలుకల మందును 100 శాతం రాయితీ పై ఉచితంగా సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా బ్రొమోడైయోలిన్ 20 గ్రాముల ఎలుకల మందును నూకలు–960 గ్రాములు, వంట నూనె –20 గ్రాములతో బాగా కలిపి 1 కిలో విషపు ఎరను తయారు చేయటం జరిగిందన్నారు.ఎలుకల విషపు ఎరను బొరెలలో పెట్టేముందు తయారు చేసుకున్న మందును, 10 గ్రాముల ఒక పేపరు నందు ఉంచి ఒక్కొక్క బొరెలో ఉంచి బొరె లను పూడ్చాలన్నారు. బ్రొమోడైయోలిన్ ఎలుకల మందు అత్యంత విషపూరితం కావున రైతులందరూ, విషపు ఎరను తయారు చేసేటప్పుడు ముఖానికి మాస్క్,చేతులకి గ్లౌజులు ధరించాలని రైతులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మీకాంత్, చంద్రశేఖర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దుస్తులు పంపిణీ చేసిన ఎన్ఎండి ఫయాజ్ , కౌన్సిలర్ ఖండే శ్యామ్



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 08: నంద్యాల టౌన్ 12వ వార్డు బాలాజీ కాంప్లెక్స్ నందు 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్ ఆధ్వర్యంలో 12వ వార్డు సచివాలయంలో ఉన్న శానిటేషన్ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని దసరా పండుగ సందర్భంగా శానిటేషన్ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దసరా పండుగ అనేది హిందువుల ముఖ్యమైన పండుగలలో ఒక పెద్ద పండుగని ఈ పండుగను ప్రజలందరూ కలిసికట్టుగా చేసుకుంటారని ఈ దసరా రోజుల్లో అమ్మవారి బొమ్మలను వాడవాడల నెలకొల్పి పూజలు నిర్వహించి అమ్మవారి కృపకు పాత్రులు అవుతారని . ఇలాంటి మంచి పండుగ రోజు 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్ గారు ఒక మంచి నిర్ణయాన్ని తీసుకుని శానిటేషన్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేయడం చాలా మంచి పరిణామమని అందరూ నూతన దుస్తులను ధరించి ఆహ్లాదకర వాతావరణంలో దసరా పండుగను జరుపుకోవాలని,ఈ కార్యక్రమంలో బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త , కండె ఆనంద్ , చింతల కుమార్, గెలివి శేఖర్,చలంబాబు , మలిపెద్ది నాగరాజు, జనార్ధన్, జయకర్, అమృత్, ఇసుక చాంద్ , చంద్రమౌళి, దస్తగిరి ,శానిటరీ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగానే దరఖాస్తుల స్వీకరణ



ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 09: పారదర్శకంగానే మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహానంది పోలీస్ స్టేషన్లో నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలు నిర్వహణ కోసం దరఖాస్తులను ఆహ్వానించిందని ప్రస్తుతం గడువు పూర్తి అయినా కూడా మరో రెండు రోజులపాటు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. పారదర్శకంగానే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎలాంటి రాజకీయ ఒత్తిడిలు కానీ ఇతర రికమండేషన్లు లేదా ప్రజాప్రతినిధులకు సంబంధించి లెటర్ హెడ్ లు తీసుకొని వచ్చారా...? అని దరఖాస్తుదారులను తాము అడగడం లేదని నిష్పక్షపాతంగా వచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరించి నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు మహానంది మండలంలోని మూడు మద్యం దుకాణాలకు 28 దరఖాస్తులు వచ్చాయన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ నందు 7 కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, డోన్ శ్రీశైలం తదితర నియోజకవర్గాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 09:నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతి గృహాలను బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తనిఖీ చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో టాయిలెట్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, రహదారి సౌకర్యం, విద్యుత్ మరమ్మత్తులకు సంబంధించిన పనులకు ఎస్టిమేట్ లు తయారుచేసి ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్లోని పనికిరాని వస్తువులన్నింటిని వేలం వేసి వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు దసరా సెలవులు ఉన్నందున విద్యార్థులు వచ్చేలోపు శుభ్రంగా ఉంచాలని ఆమె ఆదేశించారు. మూడు రోజుల అనంతరం తాను మళ్ళీ వసతి గృహాలను సమీక్షిస్తానని ఆలోగా పూర్తి చేయాలని సాంఘిక, గిరిజన హాస్టళ్ల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలోని గదులు, స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, తదితర వాటిని పరిశీలిస్తూ పరిశుభ్రంగా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన బియ్యం, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రోడ్డు ప్రమాదాలు, నేర నియంత్రణ,సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

**-ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్.**



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు అక్టోబర్ 08:**
నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఈరోజు 09-10-2024వ తేదీ ఆత్మకూరు పట్టణంలోని రెహమత్ నగర్ లో గల ఎం .ఎం . ఫంక్షన్ హాల్ నందు ఆత్మకూరు డిఎస్పి ఆర్ . రామంజి నాయక్, ఆత్మకూరు రూరల్ ఇన్స్పెక్టర్ ఎం . సురేష్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, నేరాల నియంత్రణ, సైబర్ క్రైమ్ మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది ఆత్మకూరు పట్టణంలోని షాప్ ల యజమానులు, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పట్టణంలో నేర నియంత్రణలో భాగంగా ప్రాపర్టీ నేరాలు జరగకుండా నివారణ చర్యలలో భాగంగా షాప్ ల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా దొంగతనాలు, ఏదైనా ఇతర సంఘటనలు జరిగినప్పుడు సులువుగా ముద్దాయిలను కనుగొని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు, మరియు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండుటకు షాప్ యజమానులు తమ వస్తువులను రోడ్డుపై ఉంచకుండా మరియు వినియోగదారులు తమ షాపులకు వచ్చినప్పుడు పార్కింగ్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రోడ్డు ప్రమాదాలు చాలావరకు అతివేగం వలన అజాగ్రత్త వలన జరుగుతుంటాయని కావున యువత ఏదైనా వాహనంపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని మరియు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు మరియు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు.అతివేగం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మీ కుటుంబం నష్టపోవడం మాత్రమే కాకుండా ఎదుటివారి ప్రమాదం జరగడం వలన వారి కుటుంబం కూడా నష్టపోయే ప్రమాదం ఉంది.మోటర్ సైకిల్ పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చు అని మరియు అతివేగంగా మోటార్ సైకిల్ పై వెళ్లకూడదని, కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు (మైనర్) వాహనాలు ఇవ్వడం వలన వారు ప్రమాదానికి గురి కావడంతో పాటు తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కావున చిన్న పిల్లలకి వాహనం నడిపే అవకాశం ఇవ్వకూడదని కొన్ని సూచనలు తెలియజేశారు.ఓవర్ లోడుతో ప్రయాణం చేయకూడదని ముఖ్యంగా ఆటోలలో పరిమితికిమించి ప్రయాణం చేయడం వలన ప్రమాదాలు జరగవచ్చునని కావున ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని విజ్ఞప్తి చేశారు. మరియు వాహనం నడిపేటప్పుడు సెల్ ఫోన్స్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని కావున సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రామంజి నాయక్ తో పాటు ఆత్మకూరు రూరల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి గారు ఆత్మకూరు ఎస్సై వెంకటనారాయణ రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు వార్తాపత్రికల ద్వారా, పాఠశాలలో కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మరియు వివిధ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు సైబర్ నేరాల నియంతరణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. కానీ చాలామంది ప్రజలు అత్యాశకు వెళ్లి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడడం కావున తెలియని వ్యక్తుల వద్ద నుండి వచ్చే ఫోన్ కాల్స్ ,లింక్ లపై అప్రమత్తంగా ఉండాలని, మరియు మీయొక్క బ్యాంకు సంబంధించిన పాస్వర్డ్ ఓ.టి.పి మొదలగునవి ఎవరితోను పంచుకోరాదని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోతే వెంటనే 1930 కు సమాచారం అందించిన ఎడల బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉందని విజ్ఞప్తి చేశారు.

# పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా నేర నియంత్రణకు చర్యలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 08:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు డోన్ మరియు ఆత్మకూరు సబ్ డివిజన్ లలోని శివాపురం గ్రామంలో ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ ఇన్స్పెక్టర్ ఎం .సురేశ్ కుమార్ రెడ్డి ఆద్వర్యంలో మరియు డోన్ ఇన్స్పెక్టర్ రాకేష్ ఆద్వర్యంలో గ్రామసభలు (పల్లె నిద్ర )కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని మరియు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు,మహిళలపై జరిగే నేరాలు, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు మొదలగు వాటిపై కర్ట్ టీం మరియు వారి సిబ్బంది సహాయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసు అదికారులు మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు మహిళలపై మరియు చిన్న పిల్లలపై నేరాలు జరుగుచున్న క్రమంలో వాటి భారిన పడకుండా ఉండేందుకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ళ వలలో చిక్కుకుంటే వెను వెంటనే 1930కి సమాచారం అందించిన యెడల బాధితులకు సహాయం అందించబడుతుందని తెలియజేశారు. అత్యాశకు వెళ్లి సైబర్ నేరగాళ్ల చేతిలో పడవద్దని , లోన్ యాప్, బిట్ కాయిన్స్, గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింక్స్ మొదలగు వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కాదని ఎదుటివారిని వద్ద నుండి వచ్చే లింకులను గాని మెసేజ్లను గాని ఓపెన్ చేయరాదని తెలియజేశారు. మీరు ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే 112 నంబర్ కు కాల్ చేసి మీ వివరాలు తెలియజేసిన యెడల వెంటనే పోలీసులు మీకు రక్షణగా ఉంటారని తెలియజేశారు.
వాహనాలు నడిపే వ్యక్తులు ప్రభుత్వం వారు జారీచేసిన డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయరాదు. అంతేకాక మీరు నడిపే వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇన్సూరెన్స్ మొదలైన పత్రాలు ఉంచుకోవాలి.వీలైతే మీ గుర్తింపు కార్డులు కూడా మీ వెంట ఉంచుకోవడం మంచిది.మద్యం సేవించి వాహనాలు నడపరాదు.మద్యం మనషి మెదడను తన అధీనంలోకి తీసుకుంటుంది. తాగినప్పుడు వాహనంపై కంట్రోల్ ఉండదు. మద్యం సేవించి వాహనం నడపటం ప్రమాదకరమే కాదు చట్టరీత్యా నేరం కూడా. మద్యం సేవించి డ్రైవ్ చేయటం వలన డ్రైవర్లు తమ ప్రాణాలను రిస్కులో పెట్టడమే కాకుండా అవతలి వాళ్ల ప్రాణాలను కూడా రిస్కులో పెట్టిన వారు అవుతారు. కాబట్టి, ఎట్టిపరిస్థితుల్లోను మద్యం సేవించి వాహనం నడపరాదు.మరియు మైనర్ లకు (చిన్న పిల్లలకు) వాహనాలు డ్రైవింగ్ చేసే అవకాశం ఇవ్వరాదు.
నేర నియంత్రణ కొరకు పోలీసు వారు తీసుకున్నటు వంటి చర్యలకు ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రజల యొక్క సహకారం ఎంతో అవసరమని, గ్రామాలలో నేర నియంత్రణ కొరకు ప్రతి ఒక్కరూ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్క సీసీ కెమెరా ఉంటే నేర దర్యాప్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు తెలియ చేసినారు. గ్రామాల్లో అందరూ ఐకమత్యంతో ఉంటూ ఎలాంటి గొడవలు అల్లర్లకు వెళ్లకూడదని ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తక్షణం మీకు రక్షణ కల్పిస్తారు. కావున ప్రజలందరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వారి వివరాలను పోలీస్ అదికారులకు తెలియచేసిన వారి యొక్క వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి నేర నియంత్రణకు ఉపయోగపడుతుందని, ప్రజలకు పోలీసు అదికారులు తెలియజేశారు.

# ఏపీలాంటి ఫలితాలే వచ్చాయి..

## పేపర్ బ్యాలెట్ కు వెళ్లాల్సిన సమయం ఇది : హర్యానా ఫలితాలపై జగన్ వ్యాఖ్యలు

%హర్యానా ఎన్నికల ఫలితాలు గందరగోళానికి గురి చేస్తున్నాయన్న జగన్

ఏపీ ఫలితాలకు.. హర్యానా ఫలితాలు భిన్నంగా లేవని వ్యాఖ్య


యూఎస్ సహా అభివృద్ధి చెందిన దేశాలు పేపర్ బ్యాలెట్ ఉపయోగిస్తున్నాయన్న జగన్



విజయవాడ: ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
హర్యానా ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పేపర్ బ్యాలట్ ద్వారా ఎన్నికలను నిర్వహించాలని ఆయన అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ.. 'మరో ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని గందరగోళానికి గురిచేస్తున్నాయి. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు... హర్యానా ఎన్నికల ఫలితాలు భిన్నంగా లేవు. మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం బలంగా ఉండటమే కాకుండా అభివృద్ధి చెందేలా చూడాలి. రెండింటినీ సాధించాలంటే ఏకైక మార్గం, పేపర్ బ్యాలెట్‌కి తిరిగి వెళ్లడం.
అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, నార్వే మరియు డెన్మార్క్‌లతో సహా చాలా అభివృద్ధి చెందిన దేశాలు పేపర్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తున్నప్పుడు, మనం కూడా పేపర్ బ్యాలట్ వైపు వెళ్లే సమయం ఇది. పేపర్ బ్యాలెట్ ఓటర్ల విశ్వాసాన్ని పెంచుతుంది. విశ్వాసాన్ని నింపేందుకు చట్టసభ సభ్యులు ముందుకు రావాలి' అని జగన్ అన్నారు.

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం

(మొదటి పేజి తరువాయి)
విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం ప్రకటించారు. రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది పదోసారి. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. రెండో త్రైమాసికంలో 7 శాతం, మూడు, నాలుగో త్రైమాసికంలో 7.4శాతంగా ఉండే అవకాశం. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో 7.3శాతంగా వృద్ధి రేటు అంచనా వేసింది.
మెరుగైన వర్షపాతం నమోదు, సరిపడా నిల్వలతో ఈ ఏడాది చివరికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉంది. సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరగొచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉండే అవకాశం ఉంది. తయారీ ఖర్చులు తగ్గడం, ప్రభుత్వ విధానాలు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్ తదితర కారణాలతో తయారీ రంగం వృద్ధి చెందుతోంది. ఆర్థిక రంగం స్థిరంగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. యూపీఐ లైట్ వాలెట్ పరిమితి రూ.2000 నుంచి రూ.5వేలకు పెంపు దేశంలోని సామాన్య ప్రజలకు ఈసారి కూడా ఉపశమనం లేదు. ఇఓఎల పెనుభారం తగ్గలేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , తన పాలసీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. యథాతథంగా, 6.50 శాతం వద్ద కొనసాగించింది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ తన రెపో



రేటును అలాగే కొనసాగిస్తూ వస్తోంది. రెపో రేట్‌లో ఎలాంటి మార్పు చేయకుండా, యథతథంగా కొనసాగించడం వరుసగా ఇది పదో సారి. 2024లో ఇది వరుసగా ఐదోసారి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు రెపో రేటు తగ్గింపును వ్యతిరేకించారు. దేశంలో రెపో రేటును తగ్గించకూడదంటూ ఐదుగురు సభ్యులు ఓటు వేసినట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం, 4 శాతం కంటే తక్కువగానే ఉన్నప్పటికీ, రెపో రేటులో కేంద్ర బ్యాంక్ ఎటువంటి మార్పు చేయలేదు. రెపో రేట్‌లో మార్పు ఉండదని మార్కెట్ ముందు నుంచీ ఊహిస్తోంది కాబట్టి, ఇదేమీ ఆశ్చర్యకరమైన నిర్ణయం కాదు. ÷పో రేట్ మారదని ముందు నుంచి సిద్ధమైన మార్కెట్, ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంపై మాత్రం నిశితంగా దృష్టి పెట్టింది. భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన ఏం చెబుతారన్నది ఇటు సామాన్య ప్రజలకు, అటు కార్పొరేట్లకు చాలా కీలకం. దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశర చేసే వ్యాఖ్యలు గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి కాబట్టి, ఆయన మాటలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ద్రవ్యోల్బణానికి ప్రపంచ ఉద్రిక్తతలు అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని అన్నారు. లోహాలు, ఆహార పదార్థాల ధరల్లో ఇటీవలి పెరుగుదల కారణంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రమాదంలో ఉంది. 2024 జులై, ఆగస్టు నెలల్లో ప్రధాన ద్రవ్యోల్బణం పెరిగిందని, బేస్ ఎఫెక్ట్ కారణంగా చిల్లర ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చిల్లర ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) ద్రవ్యోల్బణం 4.1 శాతంగా, మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) 4.8 శాతం, నాలుగో త్రైమాసికంలో (జనవరి-మార్చి) 4.2 శాతం ఉండొచ్చని చెప్పారు. దేశంలో ద్రవ్యోల్బణం రేటును అదుపులో ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇన్‌ఫ్లేషన్ అదుపులో ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఆహార ద్రవ్యోల్బణం మాత్రం ఇప్పటికీ లక్ష్యానికి మించి ఉంది. అంటే, దేశంలో ఆహార పదార్థాల ధరలు అదుపులో లేవు. అందుకే, రెపో రేటును 6.50 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ నిర్ణయించింది. రెపో రేట్ తగ్గితే, బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయి. రెపో రేట్ తగ్గించక పోవడంతో, కోట్లాది మంది రుణగ్రహీతలు, బ్యాంకు ఖాతాదార్లు నిరాశకు గురయ్యారు. వడ్డీ రేట్లు తగ్గితే లోన్ తీసుకుందామని ఎదురు చూస్తున్నవారికి కూడా ఇది నిరాశ కలిగించేదిగా ఉంది. పండుగ సందర్భంగా ఆర్‌బీఐ నుంచి మంచి నిర్ణయం వినొచ్చని ఎదురు చూస్తున్న ప్రజలంతా నిరుత్సాహపడ్డారు.

# వాహనదారులకు గుడ్‌న్యూస్..

## 'హమ్‌సఫర్ పాలసీ' ప్రారంభం




ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 9:
జాతీయ రహదారుల వెంబడి వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టిసారించిన కేంద్ర ప్రభుత్వం కీలక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. పరిశుభ్రమైన టాయిలెట్లు, బేబీ కేర్ రూమ్‌లతో పాటు మరిన్ని సౌలభ్యాలు కల్పిస్తూ 'హమ్‌సఫర్ పాలసీ'ని ఆవిష్కరించింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ పాలసీని మంగళవారం ప్రారంభించారు.'హమ్‌సఫర్ పాలసీ' ప్రారంభం సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ.. హమ్‌సఫర్ బ్రాండ్ దేశ హైవే నెట్‌వర్క్‌లో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందిస్తుందని అన్నారు. ప్రయాణికులు, డ్రైవర్లకు అత్యంత భద్రత కల్పిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల వెంబడి సౌకర్యాలకు పర్యాయపదంగా మారుతుందని ఆయన అన్నారు. జాతీయ రహదారుల వెంబడి నాణ్యమైన, ప్రామాణికమైన సేవలను అందించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. హైవే నెట్‌వర్క్ అంతటా అత్యున్నత స్థాయి సౌకర్యాలను అందించేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. అందరికీ వేగవంతమైన, చక్కటి అనుభూతితో నిరంతరాయ ప్రయాణాలను అందించడానికి కేంద్రం సంసిద్ధంగా ఉందన్నారు.సౌకర్యాలు ఇవే..'హమ్‌సఫర్ పాలసీ'లో భాగంగా జాతీయ రహదారుల వెంబడి క్లీన్ టాయిలెట్‌లు, బేబీ కేర్ రూమ్‌లు, దివ్యాంగులకు వీల్‌చైర్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, పార్కింగ్ స్థలాలు, ఇంధన ఫిల్లింగ్ కేంద్రాల్లో డార్మిటరీ సేవలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ విధానం హైవే వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్రం పేర్కొంది. వాహనదారులకు సురక్షితమైన, ఆనందదాయకమైన అనుభూతిని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మరోవైపు ఈ విధానం వ్యవస్థాపకులకు సాధికారత అందిస్తుందని, ఉద్యోగాల సృష్టి, జీవనోపాధిని మెరుగుపరచడంలో తోడ్పాటునిస్తుందని కేంద్రం భావిస్తోంది.